# ఎక్కవలసిన రైలు

## – సత్యం మందపాటి



"సాహితీ సిరికోన" వారి ఆధ్వర్యంలో నిర్వహించిన "శ్రీ జొన్నలగడ్డ రాంభొట్లు- సరోజమ్మ స్మారక పురస్కారం" బహుమతి అందుకున్న నవల.

*(గత సంచిక తరువాయి)*

అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలో శాన్ డియాగో నగరం.

ఆరోజు శనివారం అవటం వల్ల కాస్త ఆలస్యంగా నిద్ర లేచి, తనే కాఫీ చేసుకుని లాప్టాప్ ముందు కూర్చున్నాడు వేణు.

అప్పుడే ఫోన్ మ్రోగింది. లాసేంజలెస్ నించీ ప్రకాష్.

"ఏరా, బాగున్నావా?" అడిగాడు వేణు.

ప్రకాష్ అడిగాడు. "బాగానే వున్నాను. నీతో కొంచెం సీరియస్ విషయం మాట్లాడాలి. ఇప్పుడు మాట్లాడవచ్చా?" అడిగాడు.

"శనివారమేగా. ఖాళీగానే వున్నాను. చెప్పు" అన్నాడు వేణు.

"క్లుప్తంగా నాకు తెలిసింది చెబుతాను విను. మా ఆవిడ ప్రసూనకి చిన్నప్పటినించీ మంచి స్నేహితురాలు ఒకావిడుంది. ఇద్దరూ ఎలిమెంటరీ స్కూలునించీ కాలేజీ దాకా గుంటూరులోనే కలసి చదువుకున్నారు. ఆవిడ పేరు రాజేశ్వరి. రాజేశ్వరికి ఒక్కగానొక్క కూతురు రేఖ. రేఖకి రెండేళ్ళ క్రితం మీవూళ్ళోనే వుండే సూర్యంగారి అబ్బాయితో ఇండియాలో పెళ్ళయింది. పెళ్ళయిన నెలరోజుల్లోనే రేఖ ఆ అబ్బాయితో అమెరికాకి వచ్చేసింది. తర్వాత వాళ్ళెలా వున్నారో ఏమయిందో నాకప్పుడు తెలియదు కానీ, అబ్బాయి వేపు నించీ పరిస్థితులు అంత బాగా లేవు అని మాత్రమే తెలుసు. ఇది ఒక గృహహింస కేసు. రేఖకి సరిగ్గా పదిరోజుల క్రితమే ఒక పసిపాప కూడా పుట్టింది. రేఖా వాళ్ళ అమ్మ రాజేశ్వరి ఒక నెలరోజుల క్రితమే కూతురికి సహాయం చేయటానికి మీ వూరికి వచ్చారుట. మా ఆవిడతో రెండు మూడుసార్లు ఫోన్లో

మాట్లాడింది కూడాను. నిన్న రాత్రి పదకొండు గంటలకు మా ప్రసూనకి ఫోన్ చేసి, 'ఇక్కడ మాకు దినదిన గండంగా వుంది. మాకిక్కడ వేరే ఎవరూ తెలియదు. మీరేమో దూరంగా వున్నారు. ఇక్కడ శాన్ డియాగోలో మాకు సహాయం చేసేవాళ్ళు మీకు ఎవరైనా తెలుసా?' అని అడిగింది. వివరాలు అన్నీ విపులంగా చెప్పింది. నేనూ స్పీకర్ ఫోన్లో అన్నీ విన్నాను. వెంటనే నువ్వు గుర్తుకి వచ్చావు. నిన్న మరీ రాత్రి అయిపోయిందని నిన్ను పిలువలేదు. ఇప్పుడు తెల్లారగానే పిలుస్తున్నాను" అన్నాడు ప్రకాష్.

వేణు ఒక్క క్షణం ఆలోచించి, "నువ్వు అడిగితే కాదంటానా, చెప్పు ఏం చేయమంటావు?" అన్నాడు.

"అది నువ్వే రాజేశ్వరితోనూ రేఖతోనూ మాట్లాడి చూడు. వాళ్ళకి ఏ సహాయం కావాలంటే అది నువ్వు చేస్తావని నాకు నమ్మకం వుంది. అందుకే నువ్వు పిలుస్తావని వాళ్ళతో చెప్పాను. ఇదిగో రేఖ ఫోన్ నెంబర్. నేను కూడా రేపు సాయంత్రం నిన్ను పిలిచి నాకు తెలిసిందంతా చెబుతాను" అని ఫోన్ నెంబర్ ఇచ్చాడు ప్రకాష్.

"సరే! ఇప్పుడే పిలుస్తాను. ఐ విల్ కీప్ యు అప్డేటెడ్" అన్నాడు వేణు.

"ఎవరు?" అడిగింది, ఆ సంభాషణ వింటున్న వీణ, వేణు భార్య.

చెప్పాడు వేణు.

"అదేం బుద్ధి! పసిపాపతో వున్న బాలింతను అలాగా చూడటం" అంది వీణ.

"అవును. అదే అన్నాడు ప్రకాష్ కూడా. ఉండు, ఇప్పుడే రేఖని పిలుస్తాను" అన్నాడు.

వెంటనే రేఖకి ఫోన్ చేశాడు.

రేఖే ఫోన్ తీసుకుంది.

తనెవరో ఎందుకు ఫోన్ చేస్తున్నాడో చెప్పాడు వేణు.

వెంటనే రేఖ అన్నది, "థాంక్స్ అంకుల్. మంచి టైములో పిలిచారు. వీళ్ళందరూ ఎవరినో కలవాలని బయటికి వెళ్ళారు. నేనూ, అమ్మా, మా పాపా మాత్రం వున్నాం ఇంట్లో" అని ఒక్క క్షణం ఆగి, మళ్ళీ అన్నది.

"అంకుల్ మేము మీ ఇంటికి వచ్చి నాలుగైదు రోజులు వుండవచ్చా? మీకు ఫరవాలేదా" అన్నది.

ఒక్కసారిగా నిర్ఘాంతపోయాడు వేణు. "మీరు
రావాలని అనుకుంటే తప్పకుండా రండి. కానీ రేఖా, పసిపాపని తీసుకుని అలా అర్ధాంతరంగా ఇల్లు వదిలేసి ఒక్కసారిగా తెగతెంపులు చేసుకుని వచ్చేస్తే తర్వాత ఎన్నో సమస్యలుంటాయి. అవన్నీ ఆలోచించావా? వాటిని ఎదుర్కోగలవా?" అడిగాడు వేణు.

"అవన్నీ తీరికగా చెబుతాను అంకుల్. మేము ప్రాణాలతో వుండాలంటే ఇక వేరే మార్గం లేదు. ప్లీస్" అంది రేఖ.

"అయితే ఇప్పుడే వస్తాను, నీ అడ్రస్ ఇవ్వు" వేరే ఆలోచించకుండా వెంటనే అన్నాడు వేణు.

అడ్రస్ చెప్పింది రేఖ.

"అంటే అక్కడికి రావటానికి నాకు నలభై ఐదు నిమిషాలు పడుతుంది. ఈలోగా సిద్ధంగా వుంటారా?"

ఒక్క క్షణం ఆలోచించి అన్నది రేఖ.

"వద్దు అంకుల్. వాసు వాళ్ళు ఎప్పుడైనా ఇంటికి తిరిగిరావచ్చు. ముఖ్యమైనవి మాత్రం సర్దుకుని ఇప్పటికిప్పుడే వస్తే మంచిదని అనుకుంటున్నాను. నేను ఎక్కడికి వెళ్ళిందీ వాళ్ళకి తెలియటం మంచిది కాదు. మీ అడ్రస్ ఇవ్వండి, మేమే టాక్సీ తీసుకుని వచ్చేస్తాము" అన్నది రేఖ.

రేఖ ఎంత తెలివైన పిల్లో అర్థమయింది వేణుకి. ఆమె అనుకున్న నిర్ణయం కూడా ఎంతో ఆలోచించి తీసుకున్నదే అని తెలుస్తూనే వుంది.

ఎంత బాధలో వుంటే అలా అడిగిందో!

తన అడ్రస్ చెప్పి, "రండమ్మా! నువ్వూ, అమ్మగారూ, పాపా వెంటనే వచ్చేయండి. మా దగ్గర ఎన్నాళ్ళున్నా మాకు ఇబ్బంది లేదు" అన్నాడు వేణు.

"అలాగే, థాంక్స్ అంకుల్" అంది రేఖ.

ఆమె ఏడుపు ఆపుకుంటూ చెబుతున్నదని ఆ గొంతులో తెలుస్తూనే వుంది.

అంతా వింటున్న వీణ అన్నది, "మన రెండు గెస్ట్ బెడ్రూములూ సిద్ధం చేస్తాను. కాసేపట్లో లంచ్ కూడా రెడీ చేస్తాను" అని.

"పద, నేనూ సహాయం చేస్తాను" అన్నాడు వేణు.

అనుకున్నట్టుగానే ఒక గంటన్నరలో వేణు ఇంటి ముందు టాక్సీ ఆగింది.

ముందు రాజేశ్వరి టాక్సీ దిగి పదిరోజుల పసికందుని భద్రంగా చేతుల్లోకి తీసుకున్నది.

తర్వాత రేఖ దిగింది. వాళ్ళని చూసి వేణు చిరునవ్వుతో పలకరించాడు.

టాక్సీ డ్రైవర్ మూడు సూట్కేసులు దించాక, అతనికి డబ్బులు ఇవ్వబోయాడు వేణు.

"లేదంకుల్. నేను పే చేశాను. మమ్మల్ని ఇంట్లో వుంచుకుంటున్నందుకు చాల థాంక్స్" అంది రేఖ.

సన్నగా, పొడుగ్గా ఎంతో బాగుంది రేఖ. ఆమె ముఖంలో కొంత ఆందోళన కనపడుతూనే వుంది. కళ్ళు ఎర్రగా వున్నాయి.

తన కూతురు సరళ కన్నా రేఖ ఇంకా చిన్న అమ్మాయే అని మనసులో అనుకున్నాడు వేణు.

అప్పుడే బయటికి వచ్చిన వీణ పసికందుని చూసి, "నిద్రపోతున్నా ఎంత ముద్దొస్తున్నదో బంగారం" అని రాజేశ్వరి భుజం మీద చేయి వేసి, "రండి" అన్నది.

వేణు సూట్కేసులు గెస్ట్ బెడ్ రూములో పెట్టాడు.

సోఫాలో ఒక దుప్పటి వేసి, "పాపాయిని ఇక్కడ పడుకోబెట్టండి" అని రాజేశ్వరితో అని, పక్కనే ఇంకో దుప్పటి పైన కప్పటానికి పెట్టింది వీణ.

"ఇప్పుడు పన్నెండవుతున్నది. భోజనాలు చేద్దామా, కొంచెంసేపు ఆగుదామా?" అడిగింది వీణ.

రేఖ వెంటనే "తినేద్దాం ఆంటీ. బాగా ఆకలిగా వుంది. ప్రొద్దుటినించీ ఏమీ తినలేదు" అన్నది.

వేణు వేపు అదోలా చూసింది వీణ.

"అవును తినేద్దాం. నాకూ ఆకలిగా వుంది"

అంటూ డైనింగ్ టేబుల్ మీద అన్నీ సర్దటానికి వెళ్ళాడు వేణు.

భోజనం చేసేటప్పుడు వీణ ఏదో మాట్లాడబోయి, వివరాలు అడిగితే వాళ్ళ మనసులు కష్టపడతాయో ఏమోనని ఆ విషయాలు ఏవీ మాట్లాడకుండా అడిగి అడిగి వడ్డిస్తున్నది.

భోజనం చేస్తున్నప్పుడు మధ్యలో రాజేశ్వరి మాత్రం ఒకే ఒక మాట అన్నది, "ఇలాటి భోజనం నెలరోజుల క్రితం నేనిక్కడికి వచ్చాక మొదటిసారిగా ఇప్పుడే తింటున్నాను" అని.

వేణు వీణ ఒకరి ముఖాలు ఇంకొకరు చూసుకున్నారు.

భోజనాలయాక నిశ్చింతగా నిద్రపోతున్న పసికందు పక్కనే కూర్చుని, అటే చూస్తున్న వీణ అడిగింది, "పాపాయికి పేరు పెట్టారా?" అని.

"సుమ అని పేరు అక్కడ హాస్పిటల్లోనే వ్రాశాం. ఇవాళ్టికి అది పుట్టిన పదో రోజు" అంది రేఖ.

"అవును. విరిసిన చక్కని మల్లెపువ్వులా వుంది సుమ. ఎంతో ప్రశాంతంగా నిద్రపోతున్నది. ఆ వయసులో ఏ కష్టాలూ వుండవు కదా. ఇది కావాలనీ, అది కావాలనీ ఏమీ తెలియదు. మనసు కూడా ఎంతో హాయిగా, స్వచ్ఛంగా వుంటుంది. మనమందరం కూడా అలా వుండిపోతే ఎంత బాగుంటుందో" అన్నది వీణ, నిద్రలోనే నవ్వుతున్న సుమ లేత పెదవులు చూస్తూ.

వేణు నవ్వాడు, "మనుష్యులందరూ అలా వుంటే ప్రపంచమే స్వర్గం అయిపోదూ" అన్నాడు.

రాజేశ్వరి అన్నది, "ఇక్కడ జరిగుతున్న విషయాలేవీ ఆ పసిదానికి తెలియవు కనుకే అంత ప్రశాంతంగా వుంది. అలా కష్టనష్టాలు, సుఖదుఃఖాలు తెలియని వయసే మంచిదేమో!"

రేఖ "మా సుమకి ఈ వయసులో రెండే కష్టాలు. ఒకటి ఆకలేసి పాలు కావలసిననప్పుడు, రెండు డైపర్ తడిసినప్పుడు" అన్నది నవ్వుతూ.

వీణ పెద్దగా నవ్వింది. "అవును, అంతేగా మరి!" అన్నది.

"నేను అక్కడ వాసుకి ఒక చిన్న నోట్ పెట్టి వచ్చేశాను. ముగ్గురం వెళ్ళిపోతున్నామనీ, మా లాయర్ త్వరలో మీతో మాట్లాడతాడని వ్రాశాను. ఎక్కడికి వెళ్ళేదీ, ఎక్కడ వుండేదీ ఏమీ వ్రాయలేదు" అన్నది రేఖ

"మంచిపని చేశావు. ఇంకొక పని కూడా చేద్దాం, నీ ఫోన్ పూర్తిగా ఆఫ్ చేసేయి. వాళ్ళకి 'ఫైండ్ మై ఫోన్లో' నువ్వు ఎక్కడవున్నావో తెలియకుండా వుండాలి. మధ్యాహ్నం బయటికి వెళ్ళి వేరే ఫోన్ కంపెనీతో నీ ఫోనుకి కొత్త నెంబర్ తీసుకుందాం. అప్పుడు ట్రేస్ చేయటం కష్టం" అన్నాడు వేణు.

"అవును, నేనూ అదే అనుకుంటున్నాను, వాళ్ళని మనకి దగ్గరగా రాకుండా కోర్టు స్టే ఆర్డర్ తీసుకునేదాకా అలా వుంచటమే మంచిది. నా దగ్గర ఇంకో స్పేర్ ఫోన్ కూడా వుంది. దాంట్లో కొత్త సిమ్ కార్డు వేయిద్దాం" అంది రేఖ.

రాజేశ్వరి అన్నది "మా సమస్యలతో మీకు చాల ఇబ్బంది కలిగిస్తున్నాం" అని.

"మన దేశంలో మనకి కావలసిన దగ్గరి వాళ్ళనందరినీ వదిలేసి ఇక్కడికి వచ్చాక మనకి మనమే స్నేహితులం, బంధువులం. అన్నీను. మేము నలభై ఏళ్ళ క్రితం అమెరికా వచ్చినప్పుడు, మా కాళ్ళ మీద మేము నిలబడేవరకూ మాకు ఎందరో తెలియని వాళ్ళుకూడా సహాయం చేశారు. అది మేము ఇప్పటి వరకూ మరచిపోలేదు. ఈనాటిదాకా మాకు చేతనైనది మేము చేస్తున్నాం. మా అమ్మాయి సరళ కూడా పెళ్ళి చేసుకుని ఫీనిక్స్ వెళ్ళిపోయింది. మీరు ఎన్నాళ్ళు వున్నా మాకు ఇబ్బంది ఏమీ లేదు. మాకూ కంపెనీ వుంటుంది" అన్నాడు వేణు.

## 3

మర్నాడు అనుకున్న ప్రకారం లండన్లో జెస్సికా, సమీర వూరు చూడటానికి బయల్దేరారు.

"మీ ఇద్దరు స్నేహితులూ వెళ్ళిరండి. నేను ఇంట్లో రెస్టు తీసుకుంటాను" అన్నాడు బాబ్.

"రెస్టూ లేదు, పాడూ లేదు. అమెరికాలో జరిగే కాలేజీ ఫుట్బాల్ ఆట టీవీలో చూడాలి కదా మరి. దాని కోసం ఇదో వంక" అంది జెస్సికా నవ్వుతూ.

"అదేంకాదు, మీ ఇద్దరికీ ప్రత్యేకంగా 'స్నేహితుల సమయం' ఇద్దామని" అన్నాడు బాబ్ నవ్వుతూ.

అతని భుజం మీద సుతిమెత్తంగా కొడుతూ "తెలుసులేవోయ్, ఎంజాయ్ యువర్ గేమ్" అంటూ "పద, మనిద్దరం వెడదాం" అని సమీరతో కలసి బయల్దేరింది జెస్సికా.

వెడుతూ వెడుతూ "ఫ్రిడ్జిలో తినటానికి చాల వున్నాయి. ఇక మేము వచ్చేది ఇవాళ రాత్రికే" అన్నది జెస్సికా.

వెళ్ళగానే రెడ్ బస్సులో రెండు టిక్కెట్లు కొన్నది జెస్సికా. హోపిన్, హోపాట్ టిక్కెట్లు. అంటే ఆరోజంతా ఎక్కడైనా ఎక్కవచ్చు, ఎక్కడైనా దిగవచ్చు. ఎన్నిసార్లు అయినా ఇబ్బంది లేదు.

బిగ్ బెన్, వెస్ట్ మినిస్టర్ ఏబ్బీ, ట్రెఫాల్గర్ స్క్వేర్, పార్లమెంట్ బిల్డింగ్, బకింగ్హాం పాలస్, చేన్జింగ్ ఆఫ్ గార్డ్స్, టవర్ బ్రిడ్జ్ ఆఫ్ లండన్ మొదలైనవన్నీ చూశారు.

షేక్స్పియర్ థియేటర్లో ఆరుగంటల నాటకం మాక్బెత్ నాటకానికి టిక్కెట్లు కొన్నది జెస్సికా.

"పద! ఇప్పుడు లంచ్ తిని, థేమ్స్ నదీతీరంలో కాస్త సేద తీర్చుకుందాం" అన్నది జెస్సికా.

ఇద్దరూ ఏదో తిని, థేమ్స్ నది ఒడ్డున కూర్చున్నారు.

చల్లగా గాలి వీస్తూ వాతావరణం హాయిగా వుంది.

"ఇప్పుడు చెప్పు. ఎలావుంది చికాగోలో నీ జీవితం. మీ అమ్మా, నాన్నలని కలుస్తుంటావా" అడిగింది జెస్సీ.

"దాదాపు ప్రతి వారాంతం కలుస్తూనే వుంటాం. ఒకవేళ కుదరకపోతే, మా అమ్మే నాకు ఎంతో ఇష్టమైన ఇండియన్ ఫుడ్ చేసి, తలుపు దగ్గర పెట్టి వెళ్ళిపోతుంది. లైఫ్ గోస్ ఆన్" అంది.

"మరి ఎవరైనా బాయ్ ఫ్రెండున్నాడా... ఇంకా అలాగే వున్నావా?" అడిగింది జెస్సికా.

"లేదు. నాకు నచ్చినవాడు ఇంకా దొరకలేదు. అందుకనే నలుగురైదుగురితో మాట్లాడాక, ఎవరూ నచ్చక కొంత విరామం తీసుకున్నాను. Waiting for the perfect husband" అంది సమీర నవ్వుతూ.

జెస్సికా కూడా నవ్వుతూనే అంది. "నా ఉద్దేశ్యంలో perfect మనుష్యులంటూ ఎవరూ, ఎక్కడా లేరు. ఉండరు. మరి మనం కూడా perfect మనుష్యులం కాదు కదా! నీకు గుర్తుందా మనం కాలేజీలో ఎలా అల్లరి చేస్తూ వుండేవాళ్ళమో. అప్పుడు మనల్ని చూసిన వాళ్ళెవరూ మనల్ని ఎన్నటికీ పెళ్ళి చేసుకోరు అనేవాళ్ళం గుర్తుందా?"

అలా అన్నాక మళ్ళీ ఆ అల్లరి రోజులు గుర్తుకి వచ్చాయేమో గలగలా నవ్వింది జెస్సికా.

ఆమె నవ్వుతుంటే తనూ నవ్వింది సమీర.

"అవును, ఇంతకీ నువ్వూ మీ ఆయనా వేరువేరుగా వుంటున్నారా లేక ఇప్పటికే విడాకులు తీసేసుకున్నారా?" అని అడిగింది జెస్సికా. ఆమెకి అది తెలుసుకోవాలని సమీర వచ్చినప్పటినించీ ఆతృతగా వుంది మరి.

ఒక్క క్షణం మౌనంగా వుండి చెప్పటం మొదలుపెట్టింది సమీర.

"ఒక సంవత్సరం పైనే అయింది. మేము ఇండియా వెడుతున్నామనీ, అక్కడ నేనూ, అమ్మా, నాన్నా నెలరోజులు వుంటామనీ నీకప్పుడు చెప్పాను. ఇండియాలో తాజ్ మహల్, జయపూర్ పాలస్, కొన్ని దేవాలయాలు ఇలా అన్నీ తిరిగి మా వూరు వచ్చాం. అప్పుడే ఎవరో నాన్నకి బాగా తెలిసిన వాళ్ళు మధు గురించి చెబితే, మావాళ్ళు చాల మంచి సంబంధం అనీ, వాళ్ళని మమ్మల్ని చూడటానికి రమ్మన్నారు. అతను మెకానికల్ ఇంజనీర్. అక్కడే మంచి ఉద్యోగం

చేస్తున్నాడు. వాళ్ళు వచ్చి మమ్మల్ని కలిశారు. మధు అందంగా బాగుంటాడు. మంచి ఉద్యోగంలో వున్నాడు. స్నేహంగా వున్నాడు. అమెరికా రావటానికి తనకి అభ్యంతరమేమీ లేదన్నాడు. ఇక కావలసినదేముంది, వెంటనే సరేనని అక్కడే మేము అప్పటికప్పుడు హడావిడిగా పెళ్ళి ముహూర్తం కూడా పెట్టుకుని, పెళ్ళి చేసేసుకున్నాం. ఇక్కడికి వచ్చాక ఒక వారం, పది రోజులు చాల సరదాగా గడిపాం" చెప్పటం ఆపింది సమీర ఏదో ఆలోచిస్తూ.

జెస్సికా కూడా ఏమీ మాట్లాడకుండా, ఆమె ఆలోచనా సరళికి అడ్డం రాకుండా, నదిలో వెడుతున్న బోటుని చూస్తున్నది.

"మెల్లమెల్లగా అర్ధమయింది మధు వైఖరి. సోఫాలో కూర్చుని ప్రొద్దుటినించీ సాయంత్రం దాకా టీవీలో ఏవో చూస్తూ కూర్చుంటాడు. ఎక్కడ కాఫీ త్రాగితే అక్కడే కప్పు వదిలేస్తాడు. కడగక పోయినా, కనీసం సింకులో పడేయాలని కూడా చూడడు. నేను సాయంత్రం ఆఫీసునించీ వచ్చాక అవన్నీ నేనే కడగాలి. అంతేకాదు, నేనే వంట చేసి అన్నీ అక్కడ పెట్టి వెళ్ళాలి. కనీసం బ్రేక్ఫాస్ట్ సీరియల్లాటివి కూడా తినడు. నాకా ఇడ్లీలు, దోసెలు చేయటం రాదు. అతనికి చికాగోలో ఎవరూ స్నేహితులు లేరు. కారు డ్రైవింగ్ ఇండియాలో చేసినా, ఇక్కడ లైసెన్స్ తీసుకోకపోవటంతో తను ఎక్కడికీ వెళ్ళే అవకాశం లేదు. ఇలా ఎంతో వేధించుకు తిన్నాడు. అమెరికన్ వీసా వచ్చినా అతనికి ఉద్యోగం రాలేదు. ఒక ఉద్యోగానికి అప్లయి చేస్తే, అది తేలేదాకా ఇంకోదానికి అప్లయి చేయడు. సరిగ్గా ప్రయత్నాలు చేశాడని నేను అనుకోను" ఆగింది సమీర.

"అవన్నీ ఇండియాకీ, అమెరికాకీ మధ్యనున్న సాంస్కృతిక తేడాలేమో! ఓపిక పట్టి కొన్నాళ్ళాగితే అవే సర్దుకునేవేమో!" అడిగింది జెస్సికా.

"మూడు నెలలు కాదు, ఆరు నెలలు ఓపిక పట్టాను. ఏమీ మారలేదు. మనిషి మంచివాడే. ప్రేమగా వుంటాడు. కానీ అతనికి నాతోనూ, మిగతా అందరితోనూ కమ్యూనికేషన్ సమస్యలు, అంటే ఇండియన్ ఇంగ్లీష్ యాస, మాట్లాడే వేగం, ఒకళ్ళు మాట్లాడుతుంటే మధ్యలో అడ్డం వచ్చి మాట్లాడటం, ప్రశ్నకి ప్రశ్నతోనే సమాధానం చెప్పటం.. ఇలా ఎన్నో వున్నాయి. అందుకనే కొన్ని ఇంటర్వ్యూలకు వెళ్ళినా అతనికా ఉద్యోగాలు రాలేదు"

"అమెరికాకి వచ్చే ఇమ్మిగ్రెంట్సులో చాలమందికి యాస ఒక సమస్య. అదీకాక వాళ్ళ దేశాలకీ, ఇక్కడికీ మనుష్యుల తత్వాలు, ప్రవర్తనలు, భాష, యాస వేరు. యూనివర్సిటీల్లోనూ, లాబుల్లోనూ చూస్తున్నాం కదా. చాలమంది ఎన్నో రకరకాల దేశాలనించీ వచ్చిన ఇమ్మిగ్రెంట్స్ ఇంటర్వ్యూలలోనూ, వారి పెర్ఫార్మెన్స్ రివ్యూల్లోనూ కమ్యూనికేషన్ బాగాలేదు, ఇంప్రూవ్ చేసుకోవాలి అని చెబుతుంటారు. అయినా ఇలాటి వారందరూ త్వరలో అన్నీ నేర్చుకుంటారు. ఇక్కడ వుండిపోవాలంటే అది తప్పదు కదా! బి ఎ రోమన్ ఇన్ రోమ్ అనలేదూ. అలాగే!" అంది జెస్సికా.

"అవును. కానీ అతనిలో మార్పు ఏమాత్రం రాలేదు" అంది సమీర.

"ఇలాటి వాటికి కొంత సమయం పడుతుంది సమీ. నువ్వు చేయదలుచుకుంది వెంటనే చేయాలని అనుకుంటావు. నేనూ అంతే కానీ, నీకన్నా స్లోగా చేస్తాను. బాబ్ అన్నిట్లోనూ బాగా ముందుకు వచ్చి తనంతట తనే సహాయం చేస్తాడుగానీ, వారాంతాలు మాత్రం ఇంట్లోనించీ కదలడు. పార్టీలు షాపింగులూ పెద్దగా ఇష్టపడడు. ఎవరి స్పీడు వారిది. ఎవరి ఇష్టాయిష్టాలు వారివి కదూ!"

"అవును. ఇవ్వవలసిన సమయం అంతా ఇచ్చిన తర్వాతే, ఇక లాభం లేదనుకుని మూడు నెలల క్రితమే విడిపోయాము. విడాకులు కూడా తీసేసుకున్నాం. కొన్నాళ్ళు ఈ ఆలోచనలు రాకుండా వుండాలనే ఈ ఫెలోషిప్ తీసుకున్నాను. ఇక్కడికి వచ్చాను"

"మరి మధు?" అడిగింది జెస్సికా.

"అతను అట్లాంటాలో ఎవరో స్నేహితుడు వున్నాడని అక్కడికి వెళ్ళాడు. ఒకటి రెండుసార్లు ఫోన్ చేశాడుగానీ నేను తీయలేదు" అన్నది సమీర.

జెస్సికాకి అర్ధం కాలేదు

"కొత్తగా అమెరికాకి వచ్చాడన్నావు, మరక్కడ ఆర్థికంగా ఎలా నిలబడతాడు? నువ్వేమైనా ఆర్థికంగా సహాయం చేశావా?" అడిగింది జెస్సికా.

"కావాలంటే ఇస్తానన్నాను, జెస్సీ. కానీ అతనే వద్దన్నాడు. మా నాన్నకి అతనంటే ఇష్టం. అందుకనే మా సంసారం విడాకుల దాకా పోకుండా ఆపాలని, రోజూ ఎంతో చెబుతూనే వుండేవారు. నాకూ ఆయన బోధలు, బాధలు వినలేక బోరు కొట్టేసి, ఆయన చెప్పేది వినటమే మానేశాను. ఆయనా మధుకి ధన సహాయం చేస్తానన్నారు. మధు ఇష్టపడలేదు. అతనికి అభిమానం అడ్డం వచ్చిందేమో!"

జెస్సికా మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తున్నది.

సమీర ఇంకా ఏవేవో ఆగకుండా చెబుతూనే వుంది.

మౌనంగా వున్న జెస్సికా కాసేపాగి టైమ్ చూసుకుని, "పద. వెడదాం. 'మేక్బత్' నాటకానికి ఆలస్యంగా వెడితే షేక్స్పియర్ గారికి కోపం వస్తుంది" అన్నది లేస్తూ.

సమీరకి లేవటానికి చేయి అందించింది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments